చాగంటి సోమయాజులుగారు 1950లో రాసిన ఈ కథను జనవరి 17న చాసో జయంతి సందర్భంగా ప్రచురిస్తున్నాము.

# ఆఁవెఁతి

కీర్తిశేషులు

చాగంటి సోమయాజులు

**పెల్లినాడు ఏం చంబరపడ్డాను! డవ్వులు, ఈరనాలు, బజింత్రీలూ బాకాల్తో పాలెం యెగిరిపోయింది. పెల్లి మా వొయిబవంగా అయింది. ఏం చంబరపడ్డా నేం చంబరపడ్డాను!**

కొబ్బరాకుల పందిరేసినారు. పెల్లి పీట అలంకరించినారు. తోరనాలు, గెలల్తో అరిటి సెట్లూ, రంగు కాయితం బుట్టలు - పీర్ల పంజెరం నాగైపోయింది గుడిసె!

వసువూ పారాయ ఎెట్టుకుని, మెడ నిండా గందాలు పూసుకుని, కొత్త కోకలు కట్టి పేరంటోల్లు; సంకల్లో గొడుగు లెట్టుకుని, సిలుకు కండువాలు తలపాగాలు సుట్టి సాకల్లూ వొచ్చి పాలెం నిండిపోనారు.

అరవై రూపాయల అఁవిఁతి చేసినాము! గూనల్లో కల్లు నూతి నీల్లలా నింపినాము. గొర్రిపోతుల్ని ఏసినాము. మా వొయిబవంగా అయింది, పెల్లి. ఏం చంబరపడ్డా నేం చంబరపడ్డాను!

మా యయ్యి మేనల్లుడు దాలిగోడు. దిక్కు లేకపోతే గంజినీల్లు పోసి మా యయ్యే పెంచినాడు. మా మాఁవాఁ, నీనూ ఒక్కనాగ పెరిగాము; వొక్కసోట పెరిగినాము.

దాలిగోడు తక్కువోడా? ఎంతంత సంగిడీలైనా పాడిచేస్తాడు. బుగ్గ మీసాల రాజులు, ఎర్ర రోసాల ఎలఁవఁలు నా దాలిగోడి తోటి పంజా కలపడమే?

అర్డీడు బియ్యి పన్నం, కుండెడు గోగాకు పులునూ ఆడికి సిన్నప్పుడే సాలేది కాదు. పర్వతాల్లాటి గుడ్డల మూటల్ని కావిడేసి పది కోసులైనా ఇసురుకు వొచ్చేవోడు.

ఆడి దండల్ని గుండెల్ని నూనుకొంటూ రేవులో గుడ్డలు గుంజడం మఁరిసిపోయీదాన్ని.

ఎంత చంబరపడ్డానో అంతా అయింది. పెల్లితో టొచ్చింది పెమాదం. అరవై రూపాయిల ★అఁవిఁతి. ఎన్నాళ్లు, ఎన్ని మురి గ్గుడ్డలు ఉతికితే అరవయి రూపాలయేను! అరవయి రూపాయిలు పావం నా పెరుగుతూ వొడ్డీ కొడ్డీ.

ఎనాగ తీర్పడం? బుర్రలు బద్దలుకొట్టుకొని మా యయ్యి, నా దాలిగోడు ఆలోసించినారు. ఆకరుకి తెగించినారు. నా దాలిగోణ్ణి ★రంగం పంపేరు. నన్ను ఒగ్గనేక ఒగ్గనేక రెండు వోరాలు నసికి నసికి ఎల్లిపోనాడు నా దాలిగోడు. గొల్లున అనాడే ఏడ్సినాను.

దవదపా డబ్బు పంపుతా నన్నాడు. అప్పు తీరగానే ఇంటికొస్తా నన్నాడు. ఎన్నెన్నో సెప్పినాడు. ఎందుకూ? ఆరు మాసాలయింది. పట్టున పది రూపాయిలు పంపలేదు. ఉత్తరం లేదు, పత్తరం లేదు. చమచ్చురమైపోయింది. అస్తీ గస్తీ నేదు.

గర్రికపేట సాకలోడు తిరిగొచ్చి సెప్పినాడు. దాలిగోడు రంగంలో లాండరీ పెట్టినాట్ట. నిజమో, అబద్ధమో ఓ బరమా ★గుంటని మరిగినాట్ట. ఊళ్లో వోల్లంతా ఇంక ఆడు మనోడు కాడు; ఇంకో మనుము నూనుకోయే, అన్నారు!

నన్ను మోసం చేస్తావా, దాలిగో - అని ఏడ్సినాను. మొగుడంటే దాలిగోడే. అలాంటి మొగుడుంటే మారు మొగాడి మొకం ఏ యాడాదీ సూడదు.

మా గేమంలో నాలు క్కాంపల పనీ సేసుకొంటూ, నాలు గ్గింజలు తెచ్చుకొని గంజినీల్లు తాక్క; నా దాలిగోడు ★రంగమంట లాండరీ పెట్టి నాకు అనియాయం సేస్తాడా? నా నిక్క డింకో మనుముకి పోనా? బుద్ధికి నచ్చనేదు. లోపల బెమ ఉండేది. ఎవ రేమన్నా సెడ్డ బెమ ఉండేది.

వోరం వోరం అనుకొనే దాన్ని. పోడలో నా దాలిగోడు దిగుతాడని; నాను రేవులో ఉంటే, రేవు వోర తోవలోంచి రంగు గళ్ల లుంగీ కట్టి, సిలుకు సొక్కా, జోళ్లూ తొడిగి, రంగు బిళ్లల జోడు కళ్లకి తగిలించి, పెద్ద బుట్ట కాపింగుతో నా దాలిగోడు మా కొంచం పెద్ద పందిరి మంచం కావిడి పెట్టెలూ పట్టించుకుని, కుండెడు రూపాయ లట్టుకొని వొస్తాడని సెడ్డ బెమపడేదాన్ని. సెడ్డ ఆసె పడేదాన్ని.

రెండేళ్లానాది. ఆనలు గడియాన లానాయి.

ఇంక ఊళ్లో గొడవ. ఎదవ గేమాల్లో రంకుతనం తప్పునేదు! ★గర్లంట గడ్డికి పోతే ఇదే గోల. పొలాల్లో పనికి పోతే ఇదే సంత. పుట్ట సొరైతే సిక్కు. ఒంటరిగా ఆడదుంటే పెమాదం. ఆడికీ మొగకీ పొద్దత్తమానం రంకు గొడవే; పెద్దలకీ పిన్నలకీ ఇదే పోగాలం.

ఆడాళ్లదీ తప్పే. పొగాకు ముక్కకీ సిద్ధమే, సంతనాడు పకోడీ పొట్లాముకీ సిద్ధమే. ముండ గేమంలో మనను కట్టుకొన్న మాలచ్చిమి ఒక్కత్తె నేదు!

"ఒలే సాకలీ ఏటంటావు?" అని పెతీ ఎదవా అడగడమే. ★సున్నపు కాయలో నాలుగు డబ్బులున్న పెతీ సెత్త ఎదవా 'సాకలీ' అంటే, "ఓయ్!" అంటా దనుకొంటాడు!

"ఏమంటావు, సాకలీ! ఏమంటావు?"

పెపంచా న్ననాలి ... రోజంతా నడుమొంచి, తొడ నేతు బురదలో దిగడి, ★ఊడిస్తే బే డ్డబ్బులు కూలికి బొచ్చా వొస్తున్నాది. ఆడది రంకుకి పోతే? నాలుగు పుట్ల నేలున్న నాయుడి తోటో, డబ్బున్న బావనాణ్ణో పట్టి సంతనాడు సెయ్యి జాపితే ★ రూపాయి అర్ధా మొల్లో దోపి పొద్దస్తమానం తోటలంట, ★పెండెలంట పుస్తక మోటి సంక నెట్టి షైరులు తిరుగుతాడు, షైరులు!

ఉప్పూ పర్రా మొర్ర తీరుతుంది. పంటనాడు పది కుంచాలు తేరగా దొరుకుతాయి; సిల్లరా మల్లరా సింవాలచ్చిమి అడపా దడపా వొస్తూనే ఉంటుంది. ఆడది ఒప్పుకోక ఏం చేస్తాది? సూసీ సూణ్ణట్టు, కడుపు కాలుతున్న మొగు డూరుకోక సస్తాడా? ఎదవ నోకం!

మా యమ్మ నడిగినాడు పెద్ద బుగతగోరి కొడుకు శాత్తిరి. శాత్తిరి కేం? ఎన్ని ఏషాలైనా ఏస్తాడు. ఎయ్యి రూపాయిలు సిస్తు లొస్తాయి, ఐదు గరిసెల సేరీ ఉంది, పెద్ద మావిఁడి తోటుంది. బాబు ఎవారాల్లో ★నాదారుల్ని దిబ్బసేసి రెండు సేతులా దోస్తున్నాడు. పట్నాలంట పదేళ్లుండి పెద్ద సదువులు సదువుకొచ్చినాడు. పల్లెటూల్లో పనా పాటా? శాత్తిరికి పడుచు పిల్ల కనబడ్డం తప్పు;

"నీ కూతుర్ని నాకు కుదుర్సు" అని మా యమ్మ నడిగినాడు, శాత్తిరి. ఏం దురన్నాయం!●●

మాయమ్మ అందట


"ఏంటే మీ కష్టాలు?"

అనడిగినాట్ట శాఅత్తిరి. మా యమ్మ సెప్పుకుంది; నా పెల్లి అఁయిఁతి కయిన కరుసు, పీకల మీ దదప్పు, వొడ్డీకి వొడ్డీ, దాలిగోడు రంగ మెల్లడం; కష్టం సుకం సెప్పుకుంది.

"ఒస్సింతేటే! మీ యప్పు నూటా పాతిక రూపాయిలూ నే తీరుస్తాను. నీ కూతుర్ని నా క్కుదుర్సు!" అని పట్టు పట్టినాడు.

మా యమ్మ మొకం పెద్దదైపోయింది. అప్పు తీరుతుం దంటే మా యమ్మ ఎందుకేనా జ[illegible]కుంటాది. "ముందర డబ్బియ్యి దాని మెడ లో[illegible]తాను!" అన్నాది. నూటపాతికా పుచ్చుకొంది. అది నాకు సూపుతూ సెప్పింది. వొద్దు గాక వొద్దన్నాను. మూడు రోజులు పట్టు పట్టినాను. సాగింది కాదు!

నా మూలంగా, నా మొగుడి మూలంగా సెడిపోయినారు. కష్టపడుతున్నారు. నా దాలిగోడు అద్దోన్నం సేసినాడు. పీకల మీదప్పు కొంపమీద కొచ్చింది. అందు కొరబడ్డాను!



శనారం మద్దేన్నం. మా సాకిరేవుకి దగ్గిరగా ★ఊటగెడ్డవోర శాత్తిరికి మాఁవిఁడి తోటున్నాది. నాకు బాగా యాదన్తుండిపోయింది. సిక్కగా బలిసిన మొగిలిపెండి. జనుము బలిసిన వూబి; అమ్మోరు జుట్టునాగ పొగ నెగున్తూ నున్నవు బట్టీ. ఆ మూరు మూల మాఁవిఁడి సెట్టు కింద ఇనక నేల. అక్కడి కెల్లాను శాత్తిరి కోనం.

శాత్తిరి పిన్నవోడే. పెల్లయినా కానేదు. కానీ, యెందుకూ! సీ! ముతక మాట అనకూడదు గానీ శాత్తిరి పురున జనమ మెత్తనేదు. ఉత్త బొమికెల గూడు. పైకి నిండా నలవ బట్ట లేనుకున్నా గాజుకాయ నాగ కనబడతాడు.

కాని సెడ్డ ఏడ్సినాను. ఎయ్యి రూపాయిలిచ్చినా సెడ్డ బతుకు సెడ్డ బతుకే. శీ! దాలిగోడికి అవశారం చేసినాను. ఆడు తిరిగొస్తే?

నమాదానం సేనుకొన్నాను. సిల్లర ఎదవల్తో పోనేదు. అమ్మకీ, అయ్యకీ బాదలు తీరినాయి. బుక్కెడు గంజినీల్లు కలిగినాయి.

శాత్తిరి మా బాగా మరిగినాడు. నూటాపాతిక రూపాయిలు ఇచ్చుకొన్నాడు. వొట్టినే ఇచ్చుకొన్నాడా? మాఁవిఁడితోటలో సాలేయించినాడు; సిన్నసాల. మా యిమ్ముగా ఏయించినాడు. కురిసీలు, బల్ల, మంచం ఎట్టినాడు. కాపీకి మరపొయ్యి ఎట్టేడు. బీరువా నిండా పుస్తకాలు నింపేడు. అక్కడ నన్ను కూకో ఎట్టుకొనేవోడు.

నా నక్కదనం రోజా వొరిణించేవోడు. సెంపకి సేరడేసి బేడిసెల్లా కళ్లు, మొగిలి ముళ్లలా వళ్లు, వోటంగా వొళ్లు, అవయవాలన్నీ ఇనిత్తరంగా - సిగ్గు సిగ్గు వొరిణించేవోడు.

అందం కాకేటి నాకు? నా యీడు వోళ్లంతా ముగ్గురేసి నంతానం కలిగి ముసిలోళ్లయిపోనారు. బొళ్లిలు నేరు; గట్టిగున్నాను. గుడ్డలు గుంజి, కడుపెక్కా తిని కొవ్వెక్కి ఉన్నాను. అందం కాకేట్టి నాకు? ముక్కు సొట్టా, మూతి వొంకరా? శాత్తిరి నా వొళ్లు నూస్తూ సీతాకోక రెక్కల్లా కళ్లు ఎగిరించేవోడు.

అయేళ శుక్కరవోరం. రేవులో ఉన్నాను. మా యమ్మ శాత్తిరిగో రొచ్చుంతారు, తోట్లో కెల్లు - అని పొడిచి పొడిచి సెప్పింది. అమ్మ ఎల్లమందూ? అడిగినప్పుడల్లా రూపాయీ, అర్దా అడిగినంతా ఇచ్చుకొస్తున్నాడు.

కనునూవు మేరలో ఎవరో జట్టు మనుమ లొస్తున్నారు. తేరబారి నూసినాను. కంటి కానింది. నిరగాంతపోయి నిలునున్నాను.

"వొస్తున్నాడు, వొస్తున్నాడు! నా మొగుడు! నా దాలిగోడు, నా దాలిగోడు!" అనుకుంటూ నూసినాను. దుక్కఁవాఁగింది గ్గాదు; పున్నానికి నముద్రంలా పొంగిపోయింది. గుండె కుండలో కోడి లాగుడికి పోయింది. నరాలు తేడుకుపోయి, పేగులు పినుక్కుపోయి కుప్పలా కూలబడి నెత్తికి సేతులెట్టుకు ఏడిసినాను.

ఎదవ అప్పు తీరకపోతే ఏం? గంజి నేక వస్తులుంటే ఏం? మూన్నాళ్ల బతుకు తెల్లారకపోనా? నా దాలిగోడి కవశారం చేసినాను. సెడిపోనాను. కన్నీల్లు ఏకదారగా కారినాయి. వొళ్లంతా కరిగి, కన్నీరై, కాలువ గట్టి మాయదారి సాకిరేవుకాడ, ఊటగెడ్డలో కలిసిపోకూడదూ? బండలా మరింత బరువెక్కి బతికినాను బతుకు!

దాలిగోడు దగ్గిరకొచ్చి ఎన్నుమీద సేతులేసి; "ఓ లేడవకే, నా నొచ్చినాను!" అంటూ లేవదీసినాడు. పాడు మొగం ఎత్తి నూవనేక నూవనేక తలెత్తినాను. మబ్బులు కమ్మిన కళ్లకి మనక మనగ్గా కనబడ్డాడు. కళ్లు నులుముకు నూసినాను. నా దేముడు నా దగ్గిర కొచ్చినాడు; జనమ కేటి గావాల?

మాఁయిఁడి తోటా, మాయదారి సాలా, జనుము బలిసిన పూబీ కళ్లలో యెదురుగా కనబడ్డాయి. నోటిలో తెల్లగా సిగరెట్టు ఎట్టుకోని ఇనక వర్రని వచార్లు చేస్తున్నాడు శాత్తిరి. పొద్దున్నే సికారు కొచ్చాడు, సికారుకి!

ఇంకా తోటనో కొత్త ననుకుంటున్నాడు గావాల!

ఈడి బుర్ర వడిపోను!

●

> **'ఆఁవెఁత'**
> **మాండలికాల అర్థ వివరణ**
>
> ★ఆమెత : విందు. ★రంగం : రంగూన్ [బర్మా]లో కూలి వని దొరకడమే కాక బాగా గిట్టుబాటుగా ఉండేది అప్పట్లో. ★రంగమంట : రంగూన్‌లో. ★గుంటని మరిగినాట్ట : స్త్రీతో అక్రమ నంబంధం ఏర్పరచుకొన్నాడట.★గర్లంట .: [గరువు లంట] మెరక భూముల్లో ★నున్నపుకాయ : ఇల్లు వదిలి ఎక్కడికైనా వెళ్లేటప్పుడు చిల్లర ఖర్చుల కోనం నాణాలు దాచి తీనుకెళ్లే భరిణె. ★ఊడిస్తే : ఊడ్పు - నాట్లు [వరి వగైరా]. ★ఉప్పూ వర్రా మొర్ర : ఆకలి నమన్య. ★నా దారుల్ని : నన్నుకారు జనాన్ని [ధిబ్బుచేసి: అణగదొక్కి] ★పెండె : ఇవతల ఏం జరుగుతోందో అవతలికి కనవడనంత దట్టంగా ఉండే చెట్ల వరున [ముఖ్యంగా తాటి, ఈత]. ★ఊటగెడ్డ వోర : సెలయేటి ఒడ్డున.

# చాసో గురించి 'ఆఁవెఁత' గురించి

'చాసో' [కీ.శే. చాగంటి సోమయాజులు] రాసిన 'ఆఁవెఁత' అనే కథ ఆయన తొలి కథ కాదు. కాని కథా రచనా నైశిత్యంలో తొలి కాలంలోనే వండిపోయి గొప్ప కథల్ని మాత్రమే రాసిన చాసోగారి ఈ కథ 'అప్రకటితం'గా ఉండిపోవడం వల్ల దీని కొక ప్రత్యేకత వచ్చింది. 'చిన్నాజీ' అనే తన తొలి కథా నంకలనం వెలువడ్డ తరువాత రాశారు చాసో ఈ కథని.

చాసో ఎప్పుడు వడితే అప్పుడు ఏది వడితే దాన్ని కథగా గొలికేసే రకం రచయిత కాదు. తను చెప్పబోతున్న కథలో నర్వ సాధారణంగా అంతకిముందు ఎవరూ చెప్పని నందేశం ఉండాలి. రాస్తే ఆ కథ ఏడెనిమిది పేజీలకి మించడానికి వీల్లేదు. కథ ఇదీ అని చెప్పడానికి తాను నియమించే వాక్యాలూ, పొదిగే మాటలూ అక్కడి కవి అంతేగా కుదిరి అవి ఇంకొక రకంగా రాయొచ్చునేమో అనే అనుమానం ఆయనకి గాని, ఇంకొకరికి గాని కలగడానికి వీల్లేదు. ఆయన కథలు ఆయనేక నచ్చకపోవడం, ఆ కారణంగా ఆయన తన 78 ఏళ్ల జీవితంలో 50కి మించి కథలు లేవు పొమ్మని ఆపేయడం, తన పాఠకులని తను గీసిన గీటుకి దిగువకి వెళ్లనీవ్వకపోవడం ఆయన సిద్ధాంత కాఠిన్యానికి రుజువులు.

వ్యక్తిగత నంభాషణా పరిక్రమంలో తప్ప, చాసోగారికి తన కథలనీ, వాటి రచనా ఫణితినీ ఎవరైనా మెచ్చుకుంటే ఇచ్చగించేది కాదు. శ్రీకాకుళం నుంచి అనంతపురందాకా ఆయన తిరగని చిన్నా పెద్దా పట్టణం అంటూ లేదు. తాను



రాసిన [పుస్తక రూపంలో వచ్చిన] ఆ నలభై కథలతోనే ఆయన ఇన్ని జిల్లాల 'ఎలైట్' పాఠకులచేత 'చాసో శెభాసో' అనిపించేశారు. ఏ ఊరు వెళ్లినా ఆయన కేమీ కోరికలూ, వనులూ ఉండేవి కాదు. అలా అని ఒక లాడ్జి రూములోనే, ఒక స్నేహితుడి ఇంటి ముందు హాల్లోనో వదిమంది అభిమానులు పోగైతే తను చుట్ట మాత్రం తాగుతూ మిగిలిన వాళ్లు ఏం తాగితే అదే తాగనీ అన్నట్టు నిర్లిప్తంగా కూర్చుని; వాళ్లకు మధ్య మధ్య తన కథలలో రాలిన చమక్కులని ఉదహరించినప్పుడూ, పలుకుబడులు అర్థం కాక నందేహాలు వెలిబుచ్చినప్పుడూ కూడా నమానమైన చిద్విలానంతో వాటికి తన స్పందనను తెలిపేవారు. ఇతరుల రచనలను గురించి గాని, వారి వ్యక్తిత్వాలను గురించి [వ్యక్తిగత జీవితాల గురించి]గాని అక్కడ కూర్చున్న ఆ తొమ్మిది - వదిమందిలో ఎవరైనా ఏదైనా ఊసు లేవదీస్తే స్థానబలిమికి అతీతంగా తను అనుకున్నది అనుకున్నట్టు చెప్పేసేవారు. ఆ చెప్పడంలోనూ, అవతలివారు "అయ్యో! నా కిన్నాళ్లూ తెలిసింది కాదే!" అనుకునేటంత నమంజనంగా, ఘాటుగా చెప్పేవారు. ఇలా చెప్పి చెప్పి చాసోగారు ఎడ్మిరేషను నంపాదించుకున్నారు గాని ఎఫెక్షను పెద్దగా నంపాదించుకోలేకపోయారు. చాలామంది ఆయన్ని 'సినిక్' అన్నారు!

'ఆమెత' కథ చాసోగారు 1951 [50?]లో విజయనగరం 'హన్తబల్ హాలు'లో మూడు రోజులపాటు జరిగిన అఖిల భారత తెలుగు రచయితల మహానభలలో మూడోరోజునాడు నభాముఖంగా చదివి వినిపించినది. ఆ నభలలో కవితా గానాలు, ఉపన్యాసాలు చేసినవారిలో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు, విశ్వనాథ నత్యనారాయణగారు, తుమ్మల నత్యనారాయణ చౌదరిగారు, పింగళి - కాటూరి కవులు; తల్లావఝుల శివశంకర శాస్త్రిగారు, శ్రీశ్రీ, సోమనుందర్, అనిసెట్టి, నారాయణబాబుగార్లు, అవనరాల నూర్యారావుగారు మొదలైనవారు ఉన్నారని నాకు జ్ఞాపకం. చాసోగారు అప్పటికే ఇరవైకి పైగా కవితలు రచించారు. ఆ నేపథ్యంలో ఆయన్ని ఒక కవిత చదవమని నిర్వాహకులు నూచించినా, తాను ఒక కథనే చదివి వినిపిస్తానని ప్రకటించి చదివిన కథ ఇది.

మామూలుగా వేదిక మీద, మైకు ఎదుట నిలబడిన వ్యక్తి "మైకు ముఖంగా" చెప్పదలచుకున్నది పూర్తి అవగానే అది

బాగుండడం, బాగులేకపోవడంతో సంబంధం లేకుండా "అయిపోయింది; అదే సంతోషం" అని సూచించినట్లు సభాసదులు 'హర్ష'ధ్వానాలు చేస్తారు. కాని ఆ రోజు దాసోగారి కథ అయిపోగానే వెలువడిన చప్పట్లలోంచి పౌరాణిక నాటకాలలో కొన్ని పద్యాలకు వచ్చినట్లుగా "వన్స్‌మోర్ !"లు రావడం విశేషం. ఆ వన్‌మోర్ ధ్వానం ఆ కథలో అఖరి వాక్యాలకే వర్తిస్తుందన్న సంగతి ఆ 'బిడ్డర్స్'కీ, ఆ రైటర్‌కీ మాత్రమే తెలిసిన విధంగా ఆయన ఆ అఖరి వాక్యాలను తిరిగి చదివి వినిపించారు.

దాసోగారి కథ ఏదీ కూడా ఎంటర్‌టెయినర్ కాదు. రెండోమాటు చదవాలనిపిస్తే అది కులాసా కోసం కాక, గుండెని మరోసారి పొడుచుకునే కోరికతోనే అవుతుంది. ఆ సంగతి దాసోగారి అనేక కథలతోబాటు ఈ కథ వల్ల కూడా రుజు వవుతుంది.

దాసోగారు సభా విన్నపాన్ని [వన్స్‌మోరని] పాటించినంత నాటకీయంగానూ, 'అభిసారిక' మాసపత్రిక సంపాదకుడు 'రాంషా' కూడా పాటించారని చెప్పాలి. 'అమెత' కథలోని అఖరి వాక్యాలు దాసోగారు చదివేలోగా రాంషాగారు స్టేజి ఎక్కి, కథ అయిపోగానే దాసోగారి రెండు చేతులూ తన చేతుల్లోకి తీసుకున్నారు. ఆయనతో ఏమీ అనలేదు. మైకులో "ఈ కథని నేను అభిసారికలో ప్రచురించేస్తాను !" అని, వేరే మాట దాసోగారి నోటివెంట రాకముందే ఆ స్క్రిప్టుని ఆయన చేతుల్లోంచి తీసేసుకున్నారు. చకచకా చొక్కా పై జేబులోనుంచి రెండు పది రూపాయల నోట్లూ, ఒక ఐదు రూపాయల నోటూ తీసి సభకి ప్రదర్శించి దాసోగారి చేతిలో పెట్టేశారు. [1951లో పది గ్రాముల బంగారం 70 రూపాయలు. అంటే ఆ కథకి రాంషాగారిచ్చిన పారితోషికం ఇప్పటి లెక్కలో 1500కి పైనే !].

అయితే, నాటి నుంచి నేటి వరకు ఆ కథ ఎక్కడ అచ్చయిందో, ఎప్పుడు అచ్చయిందో [మనలో] ఎవరికీ తెలియలేదు. దాసోగారు తన నిరంతర అవిశ్రాంత ప్రయాణాలలో కనీసం కొన్ని డజన్లసార్లు సామర్లకోటలో దిగి రాంషా గారింటికి వెళ్ళి 'అమెత' కథ అచ్చు కటింగ్ కోసం, లేకపోతే వ్రాత ప్రతి కోసం వెతికి రోజులు రోజులు అక్కడ గడిపారు. 1988లో విశాలాంధ్ర ప్రచురణాలయంవారు 'దాసో కథలు' అనే పేరిట ఆయనవి23 [?] కథలు ఒక సంకలనంగా వేసినప్పుడు నే నెందుకో నరసారావుపేట నుంచి విజయనగరం వస్తున్నానని ఉత్తరం రాస్తే, "గోపాలం ! నువ్వు సామర్లకోటలో దిగి రాంషాని కలిసి ఎలాగైనా నా 'అమెత' కథ సంపాదించాలి సుమీ !" అని దాసోగారు నాకు ఉత్తరం రాశారు. ఆ ప్రయత్నం కూడా దండుగయింది. ఆ తరువాత 1990 ప్రాంతంలో విశాలాంధ్ర ప్రచురణాలయంవారే దాసో ఇటీవలి కథలు కూడా చేర్చి 40 కథలతో సంకలనం వేసినప్పుడు కూడా, ఎంత లజ్జాగుజ్జాలు వడినా ఈ కథ రాంషా గారి పంజరంలోనుంచి బయట పడలేదు. రాంషాగారు పోయాక నేను అభిసారిక ప్రెస్సులో మరింత తరచుగా అడుగు పెడుతున్నాను. వెళ్ళినప్పుడల్లా సంభాషణాక్రమాన్ని ఏదో విధంగా దాసోగారి 'అమెత' మీదకి మళ్ళించి రాంషాగారి అబ్బాయి 'పూషా'ని ఈ కథ వెతికే ప్రయత్నంలోకి దింపాను. ఎప్పటికప్పుడు "అమ్మకి ఇల్లు కట్టిన" గుణుపూరు జంగాల కథే అయింది.

అఖరి సెప్పి 1994 జనవరి రెండో తారీకుని. ఆ రోజు రాజమండ్రి ఆనం కళాకేంద్రంలో దాసో సంతాప సభ ఏర్పాటు చేసినవారు ఆ సభలో కాళీపట్నం రామారావుగారిచేత, చలసాని ప్రసాద్‌గారిచేత, నాచేత దాసోగారిని గురించి మాట్లాడించారు. కె.వి.ఎస్. వర్మగారు, చాగంటి శరత్‌బాబుగారు స్థానికులుగా ప్రసంగించారు. నా దాసో జ్ఞాపకాల్లో 'అప్రకటితం' అయిన 'అమెత' కథ సహజంగానే వచ్చింది. ఆ తరువాత పేపర్లలో వచ్చిన ఆ వార్త చూసి పూషా మరింత పట్టుదలగా 1950 దశకంనాటి 'అభిసారిక'లన్నీ వెతికి, 1952 జనవరి సంచికలో అచ్చయిన 'ఏందు' అనే కథ జిరాక్సు తీయించి పంపారు. అనగా, దాసోగారి 'అమెత' రాంషాగారికి 'ఏందు' అయింది.

'అమెత' అంటే ఏందే. అయితే దాసో అంతటి రచయిత తన కథకి తను పెట్టుకున్న హెడ్డింగుని రాంషాగారు మారుస్తారని ఊహించక, ఈ నలభైఏళ్ళుగా ఆ కథ కోసం వెతికిన వాళ్ళందరూ కూడా 'అమెత' అనే కథ కోసమే వెతికి వెతికి, దొరకలేదని తెల్చుకున్నారన్నమాట ఇప్పుడు స్పష్టమైంది.

రాంషాగారు ఈ కథ హెడ్డింగుని 'ఏందు'గా ఎందుకు మార్చారో కథ చదివితే బోధపడనివాళ్ళు అభిసారికా స్వభావాన్ని తలచుకుంటే బోధపడుతుంది. 'అభిసారిక'లో ఈ కథ ఇష్టంలేక ఇష్టంలేక దొరికినట్లుగానే ఈ కథలో ఇష్టంలేని ఇష్టం లేని అభిసారిక దొరుకుతుంది.

భ.రా.గో.

# మా నాన్న

మా ఇంటికి ఎప్పుడు వచ్చినా మా నాన్న ఇంటి ముందు వాకిట్లో మొక్కల మధ్య కుర్చీ వేసుకు కూర్చుని ఉండేవాడు - చుట్ట కాలుస్తూ - ప్రకృతిని పరిశీలిస్తూ - ఏదో ఆలోచిస్తూ

కాలేజీ నుండి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి నాన్న అలా ముందు వాకిట్లో కనిపించడం నాకు చాలా బావుండేది; సుఖంగా ఉండేది; శాంతిగా ఉండేది; హాయిగా ఉండేది. ఆయన మంచి పరిశీలకుడు. నిశితమైన పరిశీలకుడు. ఆయన కళ్ళు తీక్షణంగా చూస్తాయ్; లోతుగా చూస్తాయ్; పరీక్షగా చూస్తాయ్. ఏ చిన్న వివరాన్నీ వదిలిపెట్టవు. ప్రకృతినే కాదు; ఆయన మనుషులనీ, వాళ్ళ జీవితాలనీ కూడా చాలా జాగ్రత్తగా పరిశీలిస్తాడు. నేను 'మాస్ అబ్జర్‌వర్'నని ఒకసారి చెప్పుకున్నాడు.

విజయనగరం మా ఇంట్లో ఇంటి ముందు గేటూ, గేట్లో బోలెడంత జాగా ఉన్నాయ్. అప్పుడు ఒకప్పుడు - అంటే నా చిన్నప్పుడు మా ఇంట్లో కుళాయిలు [పంపులు - పైపులు] లేవు. నూతి నీరె తోడుకోవాలి. "గేట్లో పూలమొక్కలు పాతాలి" - అని గునపం పట్టుకు బయలుదేరాను. "నీ ముఖం ! పాతగానే సరా ! నీళ్ళు పొయ్యాలి - నూతిలో నీరు తోడి అంత దూరం మోసుకొచ్చి మొక్కలకి పొయ్యడం నీ వల్ల అయే పనికాదు; చచ్చిపోతాయ్ - వద్దు"! - అన్నాడు నాన్న. "నీ కెందుకూ? నేనే నారు పోస్తున్నాను. - నీరూ నేనే పోస్తాను -" అంటూ ఆయన మాట నేను వినలేదు.

చెట్లు పెద్దవయి పూలు పూయడం ప్రారంభించాయి. నాన్న ఆ మొక్కల మధ్యకి చేరాడు. ఓ రోజు మొక్కల మధ్య కుర్చుని యథాప్రకారం ఆలోచనలో మునిగి ఉన్నాడు. కాఫీ గ్లాసు పట్టుకుని ఆయన దగ్గరకు వెళ్ళాను. గ్లాసు అందుకుంటూ - "చూశావా ! ఎన్ని సీతాకోక చిలుకలో" అంటూ ఓ సీతకోక చిలుకని చూపించి "ఇది చాలా అపురూపమైన డిజైన్" అన్నాడు.

వెంటనే నేను "ఈ సీతాకోకల్ని మన గేట్లో ఎగిరేట్లు చేసింది నేనే ! నా వల్లే ఇవి ఇక్కడుకు వచ్చాయ్" - అన్నాను, "అవుతే ఇవన్నీ నీ వల్లే ఎగురుతున్నాయంటావ్ ! అవునవును



- ఇంట్లోకి దూరిపోతూ గోడల వెంబడి ఎగబాకుతున్న గొంగళీలు కూడా నీ వల్లే వచ్చాయ్ సుమా !" అన్నాడు.

నాకు ఒళ్ళు మండింది. "నాన్నా ! ఇంత అందంగా ఉందని నువ్వు పొగిడిన ఫలానా సీతాకోక ఒకప్పుడు గొంగళీవే సుమా ! నీకు తెలియదేమో ! సీతాకోకల్ని చూసి ఆనందించేవాడికి గొంగళీలను చూడ్డం కూడా రావాలి, వాటినీ భరించాలి - ఇవి లేందే అవి లేవు; అవి లేందే ఇవి లేవు" పొమ్మన్నాను.

"అమ్మా ! అలాగునా ! నువ్వు సైన్సు దానివి కదూ ! మా గొప్ప సత్యం చెప్పేవు. రైట రైట్, సరేసరే, అలాగేలే" అంటూ నవ్వుతూ "గొంగళీలను కూడా చూస్తాలే" అన్నాడు.

ఆయన మానవ జీవితంలోని అందాన్నీ,అంద వికారాన్నీ తన కళ్ళతో, తనకున్న ప్రత్యేకమైన కళ్ళతో చూసేడు. రెండింటినీ తన కథలలో అందంగా చిత్రీకరించాడు.

'వాయులీనం' కథలోకి కామవర్ధని రాగాలాపనతో, పువ్వు వెలుగ వానసతో.